మళ్లీ పరేషన్ !

- నేటితో నిలిచిపోనున్న ఎండీయూ వాహనాలు
- మళ్లీ కనిపించనున్న రేషన్‌షాపుల వద్ద పడిగాపుల దృశ్యాలు



జగనన్న హయాంలో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

యడ్లపాడు: ప్రజల మేలు కోసం ప్రవేశపెట్టిన ఒక్కో సంస్కరణను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం తాజాగా 'ఇంటి వద్దకే రేషన్' పంపిణీ కార్యక్రమానికి మంగళం పాడింది. ఇంటి వద్దకే వచ్చే మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్స్(ఎండీయూ) వాహనాలను మూలకు చేర్చింది. చౌక ధరల సరుకుల సరఫరాకు పాత విధానాన్నే అమలు పరచాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రజలకు మళ్లీ పాత కష్టాలు వచ్చి పడ్డాయి. రేషన్ సరుకుల కోసం ప్రతినెలా దుకాణాలకు జనం పరుగులు పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎక్కడో దూరంగా ఉన్న చౌకడిపోలకు వెళ్లడమే కాక అక్కడ గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి రేషన్ తీసుకుని వ్యయప్రయాసలతో ఇంటికి తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడనున్నాయి. ఇంటింటికి రేషన్ అందిస్తూ స్వయంశక్తితో హుందాగా జీవనం సాగిస్తున్న రేషన్ వాహనాల ఆపరేటర్లపై నిర్లక్ష్యంగా వేటు వేసింది. ఎండీయూ వాహన ఆపరేటర్లు, హెల్పర్లు జీవనాధారం కోల్పోయారు. మూడేళ్లుగా ఈ వాహనాలపై జీవనం సాగిస్తున్న వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆది వారం నుండి షాపుల వద్ద పంపిణీ ప్రక్రియను ప్రారంభించేందుకు సిద్ధమైంది. వృద్ధులు, రోగులు, దివ్యాంగులకు తామే డోర్‌డెలివరీ చేస్తామని డీలర్లు సదరు శాఖామంత్రి చేసిన చర్చల్లో చెప్పినప్పటికీ ఏ మేరకు తమ హామీ నిలబెట్టుకుంటారోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

యడ్లపాడులో గతంలో ఇలా...

యడ్లపాడు మండలం పరిధిలో 18 గ్రామ పంచాయతీల్లో 39 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 17,974 కార్డుదారులు ఉన్నారు. గతనెల వరకు 11 ఎండీయూ వాహనాల ద్వారా 222 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రతినెలా ఆయా కార్డులోని లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తున్నారు. అయితే గత ఆర్నెల్లుగా రేషన్ సరుకుల్లో కందిపప్పు పంపిణీ జరగడం లేదు.

ఎండీయూ వ్యవస్థ రద్దు చేయడం తగదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఎండీయూ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం ఎంత వరకు సమంజసం. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఇంటింటికి రేషన్ అందించేలా ఎండీయూ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ పథకానికి మంగళం పాడటం సరికాదు.

–దాసరి వరహాలు, మండల సీపీఐ కార్యదర్శి

క్యూలో నిలుచుని తెచ్చుకోవాలి !



ఇంటింటికి రేషన్ పంపిణీ నిలుపుదల చేయడం సరికాదు. రేషన్ బండి గ్రామంలోని ప్రతినెలా సైరన్ మోగిస్తూ వస్తుంది. పగలు ఇంట్లో పిల్లలున్నా తీసుకునే వారు. ఇక్కడ క్యూ, గంటల కొద్ది నిలుచోవడం ఉండదు. అన్నింటికీ మించి ప్రస్తుతం కోవిడ్ సమయంలో రద్దీ లేకుండా ఉండాలంటే పాత పద్ధతిలోనే పంపిణీ చేస్తే బాగుంటుంది.

–మద్దు సీతయ్య, లింగారావుపాలెం

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా సాగాలి

ఐటీ విభాగ అధ్యక్షులకు సూచించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



డాక్టర్ గోపిరెడ్డిని సన్మానించిన ఐటీ అధ్యక్షులు

నరసరావుపేట: హైదరాబాదు, బెంగళూరు తదితర ప్రాంతాలలో ఐటీ రంగంలో ఉన్న ఉద్యోగులు, ఇతర రంగాలకు చెందిన వారిని సమీకరించుకొని రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. నియోజకవర్గ ఐటీ విభాగానికి అధ్యక్షులుగా నియమితులైన వీరంరెడ్డి నాగిరెడ్డి గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో తన ఐటీ సహచరులతో కలిసి డాక్టర్ గోపిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియచేశారు. గోపిరెడ్డి మాట్లాడుతూ ఐటీ విభాగానికి అధ్యక్షులుగా నాగిరెడ్డిని నియమించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. నాగిరెడ్డి మాట్లాడుతూ పార్టీ తనను గుర్తించి పదవి ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా

నూజెండ్ల: మండలంలోని యోగిరెడ్డిపాలెం గ్రామంలో శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత రామచంద్రస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు, హోమాలు గత మూడు రోజులుగా గ్రామంలో పండుగ వాతావరణం మధ్యన గ్రామస్తులు నిర్వహించారు. తొలుత గణపతి పూజ, పుణ్యాహవాచనం, జలాధివాసం, ధాన్యాధివాసం, వాస్తుహోమం అనంతరం విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమానికి వినుకొండ శాసనసభ్యులు జి.వి. ఆంజనేయులు, మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు, నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు.

వైద్యసేవలు వందశాతం సక్సెస్

మొదటి వార్షికోత్సవం జరుపుకుంటున్న డాక్టర్ చెన్నారెడ్డి హాస్పిటల్



డాక్టర్ చెన్నారెడ్డి



డాక్టర్ వసంతరాయి

నరసరావుపేట: వందశాతం సక్సెస్ రేటుతో ఏడాది కాలంలో సుమారు 1000 కేసులను పరిష్కరించినట్లు డాక్టర్ చెన్నారెడ్డి హాస్పిటల్స్ అధినేతలు డాక్టర్ దొండేటి చెన్నారెడ్డి, డాక్టర్ వసంతరాయ పేర్కొన్నారు. శనివారం గుంటూరురోడ్డు వాటర్ ట్యాంకుకు ఎదురుగా ఉన్న హాస్పిటల్ ఒకటో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మీడియాతో మాట్లాడారు. తమ హాస్పిటల్‌లో ఎముకలు, స్త్రీలకు సంబంధించిన వ్యాధులు, నరాలకు సంబంధించిన సమస్యలకు అనుభవజ్ఞులైన డాక్టర్లు, అత్యాధునిక పరికరాలతో తక్కువ ఖర్చుతో పేద, మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో వైద్యసేవలు అందజేస్తున్నామన్నారు. అలాగే వివాహమై ఎన్నో ఏళ్లుగా పిల్లలు లేని దంపతులకు ఐవీఎఫ్ ద్వారా సంతానం కలిగే అవకాశం కల్పిస్తున్నామన్నారు. తమతోపాటు న్యూరాలజిస్టు డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, గైనకాలజిస్టుగా డాక్టర్ శ్రావణిరెడ్డిలు వైద్యసేవల్లో పాలుపంచుకుంటున్నారని పేర్కొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని అవినీతిపై వాగ్వాదం

వాడీవేడిగా చిలకలూరిపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



అధ్యక్షత వహించిన షేక్ రఫాని



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు

చిలకలూరిపేట: ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని అవినీతికి పాల్పడితే దానికి అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని... దురుద్దేశాలతో ప్రజా ప్రతినిధులకు ఆపాదించేందుకు ప్రయత్నించటం సిగ్గుచేటని .. సంబంధిత వ్యవహారంపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. సమావేశంలో పురపాలక సంఘ కార్యాలయంలో గతంలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేసిన గంగా భవాని మున్సిపల్ కాంప్లెక్స్ అద్దెల వసూళ్లకు సంబంధించి నిధుల గోల్‌మాల్ విషయంపై వాడీవేడిగా చర్చ జరిగింది. వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి పార్టీ ఫిరాయించిన పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి మాట్లాడుతూ మున్సిపల్ వసూళ్ల అక్రమాలకు సంబంధించిన విషయాన్ని మాజీ మంత్రి విడదల రజిని కుటుంబానికి ఆపాదిస్తూ ఆరోపణలు చేశారు. దీనికి వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు ధీటుగా తిప్పికొట్టారు. ఒక ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అవినీతికి, అవకతవకలకు పాల్పడితే చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని, ప్రజా ప్రతినిధులకు ఎలా అపాదిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు.

సేవలు అందించే అవకాశం పోలీసులకే దక్కుతుంది

పదవీ విరమణ పొందిన వారిని సన్మానించిన జిల్లా ఎస్పీ



సన్మానం పొందిన పోలీసులతో జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ

నరసరావుపేట: ప్రజలకు అత్యంత దగ్గరగా ఉండి వారి సాధకబాధకాల్లో మమేకమై సేవలందించే అవకాశం పోలీసు శాఖకే ఉంటుందని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన వి.వెంకయ్య (కమ్యూనికేషన్, ఎస్ఐ), జి.కోటిరెడ్డి (ఏఎస్ఐ అయినవోలు పోలీస్ స్టేషన్), కె.వెంకటేశ్వర్లు (ఏఎస్ఐ, చిలకలూరిపేట రూరల్), ఆర్.మధుసూదనరావు (ఏఎస్ఐ, డీటీసీ, పల్నాడు), ఎం.నాగేశ్వరరావు (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్)ను శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించి ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ వి.సత్తిరాజు, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.మాణిక్యాలరావు, ఆర్ఐలు పాల్గొన్నారు.

ఒత్తిడికి యోగా ప్రయోజనకరం

నరసరావుపేట: నిత్యం విధుల్లో ఒత్తిడికి లోనయ్యే సిబ్బందికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని డ్వామా పీడీ లింగమూర్తి అభిప్రాయపడ్డారు. యోగాంధ్ర–2025 కార్యక్రమంలో భాగంగా యోగా వీధిలో శనివారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగాలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వినుకొండ కౌన్సిల్‌లో సదావర్తి భూములపై చర్చ

వినుకొండ: స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గత సమావేశాల్లో అజెండాల మిగిలిపోయిన 38 అంశాలపై చర్చించారు. సదావర్తి భూముల్లో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ వారికే అప్పగించాలని కొంతమంది కౌన్సిల్ సభ్యులు మున్సిపల్ కమిషనర్ చైర్మన్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. మున్సిపల్ నిధులతో ఆ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించామని, కోర్టులో కేసు ఉన్నందు వలన అవి అలానే నిలిచిపోయాయని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ వివరణ ఇచ్చారు. అయితే సదావర్తి భూముల్లో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ పూర్తి స్థాయి ఖర్చులను వారే భరించి వారి ఆధీనంలో షాపులు ఉంచుకుంటారని అందుకు అనుమతించాలని కొంత మంది కోరారు. తదుపరి సాధ్యాసాధ్యాలను పరిశీలించిన అనంతరం నిర్ణయించి తీసుకుంటామని అధికారులు కౌన్సిల్ సభ్యులు తెలియజేశారు. అనంతరం స్థానికంగా ఉన్న సమస్యలు ట్రాఫిక్, విద్యుత్, మురుగునీటి సమస్య వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళా

వినుకొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో 28 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం 1666 మంది అభ్యర్థులు హాజరుకాగా కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 521 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు, స్కిల్ డెవలప్‌మెంట్ అదనపు జిల్లా అధికారి రామాంజనేయులు, జిల్లా ఉద్యోగ కల్పనా అధికారి ఎం.రవీంద్రనాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

నరసరావుపేటటౌన్: ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకరికల్లు మండలం కండ్లకుంట గ్రామానికి చెందిన యాసారపు ఇమ్మానియేలు, త్యాగలముడి గోపి ఇద్దరూ ద్విచక్రవాహనంపై గుంటూరు రోడ్డు వైపుకు వెళ్తుండగా స్వర్గపురి సమీపంలో శ్రీశైలం నుంచి గుంటూరు వైపుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. సంఘటనలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. 108 సహాయంతో క్షతగాత్రులిని నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హైమారావు తెలిపారు.